సీతం కళాశాలలో బ్యాంక్ రుణాలపై అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో కెనరా బ్యాంక్ (కంటోన్మెంట్ బ్రాంచ్) మేనేజర్ హెచ్.వరప్రసాద్ సీతం ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. బ్యాంకు అందించే వివిధ ఆర్థిక సేవలు, ప్రయోజనాలపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 18 నుండి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులకు ఉచిత సర్టిఫికేట్ కోర్సులు (కోర్సెరా), విద్యా రుణాల లభ్యత, వ్యక్తిగత ప్రమాద బీమా, విమాన ప్రమాద బీమా, డెబిట్ కార్డ్ సౌకర్యాల గురించి సమాచారాన్ని అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి రక్షణకై నాలుగేళ్లుగా సర్పంచ్ పోరాటం

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - జామి: **తన సొంత భూమి కాదు. కానీ ప్రజలకు ముఖ్యంగా గ్రామానికి ఎంతో ఉపయోగకరమైన ప్రభుత్వం భూమిని కాపాడాల్సిన బాధ్యత నాపై ఉందని భావించిన ఈ గ్రామ సర్పంచ్ ప్రభుత్వ రక్షణకై నాలుగేళ్ళగా పోరాడుతునే ఉన్నాడు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం అతనికి కనీస సహకారం అందించకపోవడం దారుణం.** వివరాల్లోకి వెళితే..

మండలంలోని అట్టాడ రెవెన్యూలోని సర్వేనెం. 77,79లతో పాటు 83,87, ఇతర సర్వే నెంబర్లలో భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంస్థ దాదాపు 30ఎకరాలకు పైగా వ్యవసాయభూములను కొనుగోలు చేసి భారీ లేఅవుట్ వేయడం జరిగింది. ప్రస్తుతం ఇవి అమ్మకాలు కూడా పూర్తియ్యాయని సమాచారం. కానీ వారు కొనుగోలు చేసిన భూములలో దాదాపు 5 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండడంతో గతంలో అధికారంలో ఉన్న ఓ సర్పంచ్, పార్టీ నేతలు కలిసి లేఅవుట్ దారులతో కుమ్మక్కయి ప్రభుత్వ భూమి విషయాన్ని వదిలేసారు. కానీ గ్రామ సర్పంచ్‌గా నాలుగేళ్ళ క్రితం ఎన్నికైన పోతల అమ్మన్నదొర మాత్రం ప్రభుత్వ భూమిని కాపడేందుకు నడుం బిగించాడు. స్థానికులు కొందరు అతనికి మద్దతుగా నిలవడంతో జిల్లా అధికారులను సైతం కలిసి తమ వినతిలను అందించారు. దీని పర్యావసానంగా గత ఏడాది అక్టోబర్‌లో స్పందించి లేఅవుట్‌లో సర్వే చేయించి ప్రభుత్వ భూమి ఉన్నట్లుగా గుర్తించారు. అనంతరం సర్వేనెం. 77,79లో ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు పాతి అక్కడితో వదిలేసారు. దీంతో పాటు పంచాయతీకి ఇచ్చిన 10శాతం రిజిస్ట్రేషన్ భూమికై సర్పంచ్ పోరాడుతున్నారు. కానీ లేఅవుట్ దారులు ఆస్థలంలోకి వెళ్ళడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నారు. ఈవిషయంలో మండల స్థాయి అధికారులు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని సర్పంచ్ వాపోతున్నాడు. పంచాయతీకి కేటాయించిన స్థలంలో మామిడితోట ఉందని, వాటి ఫలసాయాన్ని లేఅవుట్‌దారులే తీసుకుంటున్నారని సర్పంచ్ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడాలని, పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేయించాలని కోరుతున్నారు.

దళిత నేత గోకా రమేష్ మృతి: ఉద్యమనేతల నివాళులు

విశాలాంధ్ర - విజయనగరం: బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయసాధనకు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకై గత 15 సంవత్సరాలుగా దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గోకా రమేష్‌బాబు విశేష కృషి చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, దళిత నేత ఆతవ ఉదయ భాస్కర్ కొనియాడారు.

గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రమేష్‌బాబు మరణించారు. జిల్లా కేంద్రంలోని గోకపేటలో ఆయన పార్థివద్దేహం వద్ద దళిత నేతలు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దళిత ఉద్యమంలో చురుకైన పాత్రవహించి అకాల మరణం చెందడం దళిత జాతికి ఎంతోలోటని విచారం వ్యక్తం చేశారు. అట్రాసిటి పరిరక్షణ, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు, భూమి సమస్యలు, ఇలా అనేక రంగాలలో ప్రజలకు అండగా రమేష్‌బాబు నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింమూర్తి, రేగేటి సంతోష్, టి.వి.దుర్గారావు, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌ని కలిసిన గాంధీ స్మారక నిధి సభ్యులు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతి రాజుని ఆదివారం ఉదయం వారి నివాసంలో గాంధీ స్మారక నిధి సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రొంగలి పోతన్న, బివి రమణ, వీర్రాజు, చిన్నం నాయుడు, ఎర్నా యుడు, ఈపూ విజయకుమార్, మజ్జి కాంతారావు, బాషా, గోపాల్, బసవమూర్తి, సత్యనారాయణ మూర్తి, చంద్రశేఖర్, కామేశ్వరావు, విఎల్.మూర్తి, హనుమంతరావు, అనూష తదితరులు ఉన్నారు. సంస్థ తరపున అశోకగజపతి రాజుకి నోటుపుస్తకాలు అందజేశారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
డీఎంహెచ్ఓ డా. జీవనరాణి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డా. జీవనరాణి ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆమె పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం కావడం వలన సీజనల్ వ్యాధులతోపాటు మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని, అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బందికి సూచనలు చేయటం జరిగిందన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఏజెన్సీకి ముఖ దూరంగా ఉండడంతో ఏఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలం నుండి అధికంగా రోగులు ఆసుపత్రికి వస్తూ ఉంటారని ఇప్పటివరకు ఆసుపత్రికి వచ్చిన రోగులు వివరాలను తెలుసుకోవడం జరిగిందని ప్రస్తుతం డయేరియా కేసులు ఏవి లేవని ఆమె అన్నారు.

కూటమి హయాంలో మహిళలపై పెచ్చుమీరుతున్న దాడులు

అమలులో కక్షపూరిత రాజ్యాంగం
నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి మహిళలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని ప్రస్తుతం కక్షపూరిత రాజ్యాంగం అమల్లో ఉందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఆదివారం మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుడ్లవల్లేరు ఆడబిడ్డ డబ్బులు ఇవ్వలేదని చెట్టుకు కట్టిన సంఘటన, మెడికల్ విద్యార్థినిలపై పోలీసుల లాఠీ ఛార్జ్ సంఘటన, కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పల హారికపై చేసిన దాడిని ఇలా రాష్ట్రంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని దీనిని వైసీపీ మహిళా విభాగం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అదేవిధంగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ విద్యార్థినీల న్యూడ్ ఫోటోల సంఘటన ఇలా చెప్పు కుంటూ పోతే రాష్ట్రంలో అన్నిచోట్ల మహిళలకు భద్రత కరువైందన్నారు. క్రమశిక్షణ లేని పాలన జరుగుతుందని కక్షపూరిత రాజ్యాంగాన్ని అమలు చేస్తుందన్నారు. అసభ్య పదజాలంతో మహిళా కార్పొరేటర్ వనితీరుపై దూషించిన వారు ఒకరు అయితే కారు షెడ్‌లో ఉండాలి ఆడది వంటింట్లో ఉండాలి అని మరొకరు మన రాష్ట్రంలో ఆడవాళ్లకు భద్రత ఎలానో లేదు కనీసం గౌరవం కూడా లేని రాష్ట్రంలో ఉన్నామన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాజీ మంత్రి ఆర్కే రోజాని దూషించడంపై ఒక మహిళగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కనీసం మంత్రిగా చేసిన ఆర్కే రోజా వంటి ప్రజా ప్రతినిధులకే భద్రత లేకపోవడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే నగరి నియోజక వర్గం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మున్సిపల్ మేయర్ వెంపడాకు విజయ లక్ష్మి, నగర మహిళ కార్పొరేటర్లు బాలి పద్మా వతి, పిన్నింటి కళావతి, ఆల్తి సత్యకుమారి, సునీత రెడ్డి, తాళ్లపూడి సంతోషి మహిళ నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడుకి సన్మానం

విశాలాంధ్ర - మెరకముడిదాం: మెరకముడిదాం మండలం కొండలావేరు పంచాయతీ బాడాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీ అయిన హేమ సుందరను ఉపాధ్యాయ సిబ్బంది, స్ఫూర్తి, శ్రీరామ్ ట్రస్టుల సిబ్బంది, గ్రామ పెద్దలు ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీను, గ్రామ పెద్దలు మాట్లాడుతూ హేమ సుందర మాస్టారు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలు పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించటంలో హేమ సుందర మాస్టర్ కృషి ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - రాజాం: రాజాం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఆదివారం ఉదయం ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ రాజాం మీడియా మిత్రుల సమీక్షలో ప్రశాంతంగా ముగిసాయి. గౌరవ సలహాదారులుగా యు.వి.చంద్రశేఖర్, ముఖ్య సలహాదారుగా సతీష్, గౌరవ అధ్యక్షుడు కె.వి.ఎస్.కె.జె.శర్మ, అధ్యక్షుడు పెంకి వెంకటరావు, ఉపాధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాసరావు, గుడుబండి సూర్యనారాయణ, కార్యదర్శి కరణం సురేష్ కుమార్, సహాయ కార్యదర్శులు వద్దాది రాజేష్, టి.మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగిరి వెంకటరావు, ఖజానాదారు (ట్రెజరర్) పాలవర్తి గణేష్, కార్యవర్గ సభ్యులు కె.వి.బి.సురేష్, చందు, కె.శ్రీనివాసరావు, ఎం.జగదీష్, కె.అన్నరావు, టి.శ్రీనివాసరావు, ఎం. కిషోర్‌లు ఎన్నికయ్యారు. రాజాం నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పెంకి వెంకట్రావు మాట్లాడుతూ సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని తూ.చ తప్పకుండా పాటిస్తామని, మిత్రులకు ఏ సమయంలో అయినా అందుబాటులో ఉంటామన్నారు.

నగరంలో దంచికొట్టిన వాన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో గంట పాటు దంచి కొట్టింది. దీంతో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. మార్కెట్ వీధులు చెరువులను తలపించాయి. ఎక్కడిక్కడ నీరు నిలిచిపోవడం, కొన్ని కాలనీల్లో ఇళ్లల్లోకి నీరు వెళ్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా కొన్ని గంటల పాటు రోడ్లపై మురుగు నీరు ఉండిపోయింది. కొన్ని అపార్టుమెంటు సెల్లార్‌లలోకి కూడా వర్షం నీరు అధికంగా చేరింది. అనేక ప్రాంతాలలో రోడ్లపైఉన్న గుంతల్లోనీరు నిల్వ ఉండిపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆకస్మితంగా కురిసిన వర్షం కారణంగా చిరు దుకాణదారులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. కాగా ఇటీవల కాలంలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు ఇంచుమించుగా వేసవి కాలాన్ని తలపించాయి. ఆదివారం కురిసిన వర్షం కారణంగా పట్టణ వాసులందరికీ కాస్త ఉపశమనం కలిగించింది.

జిందాల్ రైతులతో ముఖాముఖి చర్చలు జరపాలి
స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: జిల్లా ఇంచార్జ్ మంత్రి అనిత, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్‌లు జిందాల్ భూ బాధితులతో సమావేశం ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ అల్యూమినియం కర్మాగారం కారణంగా భూములు కోల్పోయిన రైతులు గత 25 రోజులుగా నిరసనలు చేస్తున్నారని వారి డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయడానికి కూడా అవకాశం లేకపోవడం దారుణమన్నారు. పోలీసులు నిరసనకారులపై బైండోవర్ కేసులు పెట్టి బెదిరించడం తగదన్నారు. జిందాల్ యాజమాన్యం రైతులకు ఇప్పటివరకు 80 కోట్లు చెల్లించిందని జిందాల్ భూముల విలువ 2 వేల కోట్లకు పైగా పెరిగాయని దీంతో జిందాల్ యాజమాన్యం ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని చేయాలని చూస్తుందని అందుకే జిందాల్ భూములకు సంబంధించి నాలుగు పంచాయతీలలో భూముల రికార్డులు మాయం చేశారని ఎమ్మెల్సీ అన్నారు. జిందాల్ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి లేక రిటైర్డ్ జడ్జితో గాని, సిబిఐ విచారణ గాని చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కి లేఖ రాశామన్నారు.

మండల సీఐటీయూ కన్వీనర్‌గా బలస శ్రీను

విశాలాంధ్ర - రామభద్రపురం: కార్మికుల సమస్యల పోరాటానికి నిరంతరం పనిచేస్తానని నూతనంగా ఎన్నికైన సీఐటీయూ మండల కన్వీనర్ బలస శ్రీను అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ హైస్కూల్లో సిఐటీయు మండల కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో ఆయనను కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సిఐటియు కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని అన్నారు. దేశ సంపదను కార్మిక శ్రమను దోచిపెట్టే విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్‌గా బలస శ్రీను, కో కన్వీనర్‌గా కుమారి, అరుణ, 17 మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో రాధ, కళావతి, భవాని, వెంకీ, రామకృష్ణ, శ్యామల పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అధితి గజపతిని కలిసిన సోంబాబు

విశాలాంధ్ర - పూసపాటిరేగ: విజయనగరం మండలం టీడీపీ గ్రామ కమిటీలు, బూత్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జిల నియామక ప్రక్రియకు పరిశీలకులుగా సామంతుల సోంబాబును పార్టీ నియమించిన విషయం తెలిసిందే. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అధితి గజపతి రాజుని సామంతుల సోంబాబు మర్యాదపూర్వకంగా కలిసి బూత్ కమిటీల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు బద్దలు నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గంట పోలినాయుడు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల స్థాయిని పెంచేందుకు క్విజ్ పోటీలు
సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ

విశాలాంధ్ర - గంట్యాడ: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి పెంచేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ అన్నారు. ఆదివారం గంట్యాడ ఎస్సీ బాలుర వసతిగృహంలో అన్నపూర్ణ పర్యవేక్షణలో వసతి గృహ సంక్షేమ అధికారి గొర్ల గోవింద సన్యాసిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులతో పాటు జనరల్ నాలెడ్జిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు అన్నపూర్ణ బహుమతులు అందజేశారు. తోటి విద్యార్థులతో పోటీ పడటం వలన విద్యార్థుల నైపుణ్యం మెరుగుపడుతుందని పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకుంటారు అన్నారు.

వైజ్ఞానిక దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యం

- అర్థశాస్త్రం ప్రొఫెసర్ డా. కె.పద్మావతి

విశాలాంధ్ర - బొబ్బిలి: వైజ్ఞానిక దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని అర్థశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మావతి అన్నారు. పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక బొబ్బిలి డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు వి.సత్యంనాయుడు అధ్యక్షతన విద్యారంగం వైజ్ఞానిక దృక్పథం అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. ప్రస్తుత విద్యా రంగంలో సైన్స్‌కి, సూడో సైన్స్‌కి మధ్య తేడాను గమనించాలన్నారు. ప్రస్తుతం శాస్త్రీయ దృక్పథం పెంపొందించగలిగే మార్గానికి కొన్ని ఆటంకాలు వస్తున్నాయని, దానికి కారణం విధాన పరమైన నిర్ణయాలని అన్నారు. ఈనాడు ప్రభుత్వ విధానాలు కూడా విద్యార్థుల సృజనాత్మకతకు దోహద పడే విధంగా లేవన్నారు. అటువంటి విద్యారంగంలో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ్ ప్రభాస్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, జిల్లా గౌరవాధ్యక్షులు కె.శివానందు, జన విజ్ఞాన వేదిక నాయకులు ఆనెం శ్రీనివాస్, శశిభూషణ్ ,బాల భాస్కర్, వి.రాంబాబు,శంబంగి శ్రీనివాస్, రామకృష్ణ, యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, మధుసూధన రావు, సుధాకర్, బత్తుల శ్రీనివాస్, మహేష్, పెన్షనర్స్ సంఘం నాయకులు కె.సత్యన్నారాయణ, చంద్రినాయుడు, శ్రీరామమూర్తి, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ పురుషోదిని, రవీంద్రని, ఎస్వీ.రమణ మూర్తిని, కృష్ణ దాసులను ఘనంగా సత్కరించారు.

సీతంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంపై అవగాహన నిర్వహించారు. జేఎన్‌టీయూ జీవీ అసోసియేట్ ప్రొఫెసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్ మార్గదర్శకత్వంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నాయకత్వం వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి, రోజువారీ జీవితంలో అనవసరమైన ప్లాస్టిక్‌లను తొలగించాల్సిన అవసరం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గాను ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

సర్వరోగ నివారణకు హోమియో దోహదం

విశాలాంధ్ర ప్రతినిధితో బల్లంకి హోమియోపతి వైద్యాధికారిణి ఎం.శిరీష (ఎండి హోమియోపతి ఇంటర్వ్యూ

విశాలాంధ్ర - వేపాడ: సర్వరోగ నివారణకు హోమియోపతి మందులు ఎంతగానో ఉపయోగపడతాయని బల్లంకి హోమియోపతి వైద్యాధికారిణి ఎం.శిరీష (ఎండి. హోమియోపతి) అన్నారు. వేపాడ మండలం బల్లంకి గ్రామంలో ప్రభుత్వ హోమియోపతి వైద్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటలకు వైద్య సేవలుఅందించబడతాయి అన్నారు. అయితే మూడేళ్లగా బల్లంకిలో హోమియో వైద్యులు లేనందువలన వైద్యం అంతంత మాత్రమే అందేదని ఈమధ్య కొత్తగా ప్రభుత్వ నియామకంలో సర్వీస్ కమిషన్‌లో భాగంగా ఎంపికయి ఇక్కడ వైద్యులుగా తనను నియమించారని ఎం.శిరీష(ఎండి. హెూమియోపతి) అన్నారు. అలాగే ప్రస్తుతం బల్లంకి, బానాది, ఎం.సింగవరం, బక్కు నాయుడుపేట, కృష్ణా రాయుడుపేట, ఎన్.కె.ఆర్.పురం, చినగుడిపాల, భర్తవానిపాలెం, కొత్తవలస, తదితరు గ్రామాల నుండి రోగులు వస్తున్నారని ఇంకా మండలంలో అన్ని గ్రామాలకు హెూమియోపతి వైద్యం విస్తృత పరిచేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో కృషి చేస్తానన్నారు. విశాలాంధ్ర ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న: ఈ హోమియోపతి మందులు ఏ వయస్సు వారు వాడవచ్చును.?

ఎం.శిరీష: హోమియోపతి మందులు అన్నది వయస్సులతో సంబంధం లేకుండా చిన్న పిల్లల దగ్గర నుండి యుక్త వయస్సు ముసలితనం వరకు స్త్రీ, పురుషులంతా వాడవచ్చు.

ప్రశ్న:- చిన్నపిల్లలకు ఏ విధమైన వ్యాధులకు హోమియోపతి వైద్యం పనిచేస్తుంది.?

ఎం.శిరీష:- చిన్న పిల్లలకు జలుబు, దగ్గు, ఇమ్యూనిటీ పెంచుటకు, ఎనీమియా అనగా రక్తలేమి సమస్యను నివారించి రక్తం పెరగడానికి ఉపయోగపడుతుంది.

ప్రశ్న:- స్త్రీల సమస్యలకు ఏవిధంగా హోమియో మందులు పనిచేస్తాయి?

ఎం.శిరీష:- ముఖ్యంగా స్త్రీలకు అన్ని రకాల సమస్యలకు అనగా నెలసరి సమయంలో అధిక రక్తస్రావం నివారించుటకు అలాగే గర్భంలో ఎటువంటి నొప్పులకు తావు లేకుండా గర్భం దాల్చిన స్త్రీలు కూడా ఈ మందులు వాడవచ్చు.

ప్రశ్న:- ఎటువంటి రోగాలకు ఈ మందులు ఉపయోగపడతాయి?

ఎం.శిరీష:- ఎలర్జీ సమస్య, గ్యాస్టిక్ సమస్య, చర్మ వ్యాధులకు, కిడ్నీ సమస్య, స్టోన్ షుగర్ లెవెల్ తగ్గించుటకు హోమియోపతి మందులు ఉపయోగపడతాయి.

విద్యావేత్తలకు నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డు - 2025 ప్రదానం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శశి భూషణరావు, సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్, విజయనగరంలోని జిల్లా జేఎన్టీయూ జీవీ నోడల్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్‌లను ప్రతిష్ఠాత్మకమైన నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డు - 2025తో సత్కరించారు. విద్య, నాయకత్వం, పరిశోధన, సమాజ అభివృద్ధి రంగాలకు వారి అత్యుత్తమ కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించారు. స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ వంటి ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రభావవంతమైన పరిశోధన ప్రచురణల ద్వారా ఇద్దరు ప్రముఖ విద్యావేత్తలు ఉన్నత విద్యలో గణనీయమైన పురోగతి సాధించారు. వారి విద్యా పోర్ట్‌ఫోలి యోలలో రచయిత పుస్తకాలు, డిజైన్ పేటెంట్లు కూడా ఉన్నాయి. విద్యా రంగానికి అతీతంగా, రక్తదాన శిబిరాలు, మొక్కల పెంపకం డ్రైవ్‌లు, యోగా అవగాహన కార్యక్రమాలు వంటి సామాజిక కార్యక్రమాలలో వారి అంకిత భావంతో పాల్గొనడం సామాజిక అభివృద్ధికి వారి సమగ్ర విధానాన్ని నొక్కి చెబుతుంది.

కొప్పర హైస్కూల్ అభివృద్ధికి రూ.10 వేలు వితరణ

విశాలాంధ్ర - వంగర: మండలంలో కొప్పర హైస్కూల్ అభివృద్ధి పనుల కోసం ఆ గ్రామానికి చెందిన సిరిపురపు శ్రావణ్ కుమార్ రూ.10 వేల రూపాయలను అందజేశారు. కీ.శే. మాజీ హెచ్ఎం సిరిపురం జగన్నాథం కుమారుడు సిరిపురం శ్రావణ్ కుమార్ ఆయన తండ్రి జ్ఞాపకార్థం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నేత కిమిడి అప్పలనాయుడు తదితరులున్నారు. పాఠశాల అభివృద్ధికి ఈ నిధులు సమకూర్చిన శ్రావణ్ కుమార్‌ను పలువురు అభినందించారు.

విశాలాంధ్ర
విజయనగరం
పేజి : 2
సోమవారం 21, జూలై 2025

ఆధ్యాత్మిక గీతాల పోటీల విజేతలు వీరే

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రం, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఆధ్యాత్మిక గీతాల పోటీలకు చక్కటి స్పందన లభించింది. దుప్పాడలో గల శ్రీ క్షేత్రంలో జరిగిన ఈ పోటీలలో సుమారు 50 మంది చిన్నారులు పాల్గొని ఆధ్యాత్మిక గీతాలు చక్కగా ఆలపించారు.ఈ పోటీలలో సీనియర్ విభాగంలో పి.భువనేష్, ప్రియ గీత, లక్ష్మీ సాహితీ విజేతలుగా నిలవగా, జూనియర్స్ విభాగంలో జనహిత, సమన్విత, ఝాన్సీ, జాహ్నవి, అభి విజేతలుగా నిలిచారు. మండపాక డాక్టర్ మండపాక రవి, శారద దంపతులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శ్రీక్షేత్రం ధర్మకర్త దుర్గా బాలాజీ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రవ్వ మంజు, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన ఎమ్మెల్యే కోళ్ళ

విశాలాంధ్ర-వేపాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గౌరవనీయులైన చింతకాయల అయ్యన్న పాత్రుడుని నర్సీపట్నంలో గలవారి స్వగృహంలో శృంగవరపుకోట ఎమ్మెల్యే దంపతులు కోళ్ళ లలిత కుమారి,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పల రాంప్రసాద్‌లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఈ నెల 30వ తారీఖున జరగనున్న తమ కుమారుడు ఖాసాపేట సర్పంచ్ కోళ్ళ భూపాల్ నాయుడు వివాహానికి హాజరై తమరు ఆశీర్వాదాలు అందించాలని ఆహ్వాన పత్రికను అయ్యన్నపాత్రుడుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సీతారామ పాత్రుడు, గోగాడ జగన్నాథం నాయుడు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల సంఘం జాయింట్ సెక్రటరీగా చిప్పాడ రమణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్ : రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ఎన్నికల్లో విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం సీతంపేట గ్రామానికి చెందిన చిప్పాడ రమణ రేషన్ డీలర్ల సంఘానికి జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రెసిడెంట్ లీల మాధవరావు ఈ నియామకాన్ని ఆదివారం విజయవాడలో ప్రకటించారు. ఈకార్యక్రమం మాఖినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది.

సుపరిపాలనకు తొలి అడుగు

విశాలాంధ్ర శృంగవరపుకోట రూరల్ : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట మండలం, కొట్టాం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. వర్షం సమయంలో కూడా స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ప్రజల సమస్యలు విని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సందర్భంగా గ్రామంలో ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఏ స్థాయిలో అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎస్ కోట వాయిస ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, మండల తెదేపా నాయకులు మొదలైనవారు హాజరయ్యారు.

మెరకముడిదాం : చీపురుపల్లి శాసనసభ్యులు



కిమిడి కళా వెంకట్రావు సూచనలతో "సుపరిపాలనలో తొలి అడుగు"కార్యక్రమంలో మన ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరిగిన సంక్షేమము అభివృద్ధి గురించి, మెరకముడిదాం మండలం ఎం.రావివలస గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమం గురించి వివరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి సన్యాసినాయుడు పిఎసిఎస్ చైర్మన్ పిన్నింటి అప్పలనాయుడు బూత్ ఇన్చార్జిలు ఎడ్ల తవిటి నాయుడు పిన్నింటి కృష్ణమోహన్ అట్టాడ శ్రీనివాసరావు పిన్నింటి సూర్యనారాయణ పిన్నింటి అచ్యుత రావు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మెమో 57ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలుచేయాలి

ఏపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : 2003 ముందు నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం జారీచేసిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసి వారికి పాతపించను విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సెల్లర్ జెసి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపిటిఎఫ్ కార్యాలయంలో ఫెడరేషన్ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు జె సి రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీచేసి ఏళ్ళు గడుస్తున్నా దాన్ని అమలుచేయడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. తద్వారా 2003కు ముందుఉద్యోగ నియామకం పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2023 జులై నుండి ఉద్యోగులకు 12 వ వేతన సవరణ జరగాల్సి ఉండగా రెండేళ్లు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం ఆదిశగా ఆలోచన చేయకపోవటం ఉద్యోగ, ఉపాధ్యాయుల, పింఛనుదారులను తీవ్ర నిరాశకు గురిచేస్తుందన్నారు. తక్షణమే 12వ వేతన సంఘాన్ని నియమించాలి ,2023 జులై నుండి మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి బకాయిలు, ఇతర ఆర్థిక బకాయిలు షుమారు 25 వేల కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే ఉద్యోగుల ఖాతాలకు విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు నెలనెలా తమ జీతాల నుండి ఈహెచ్‌ఎస్‌కు కొంత జమచేస్తున్నప్పటికి చాలా రెఫరెల్ వైద్యశాలలు వాటిని అమలుచేయక పోవడంవల్ల ఉద్యోగులు తీవ్రమైన అన్యాయానికి గురికావలసి వస్తుందన్నారు.కావున ప్రభుత్వం తక్షణం స్పందించి నిబంధనల మేరకు రిఫరల్ హాస్పిటల్స్ నడుచుకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు బిల్లులు అయ్యేలా పొజిషన్ ఐడిల సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. బోధనేతర కార్యక్రమాలు నుండి ఉపాధ్యాయులను తప్పించాలని, కొత్తగా ఏర్పడిన ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలు నెల కొల్పాలని, కెజిబివిలలో పనిచేస్తున్న సిబ్బందికి కనిసవేతనం అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చిన్నారావు, అర్ఎన్ రాజు, రమేష్, దర్శనం, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్థలం రాజావారిది కాదు... ప్రభుత్వ స్థలమే

పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, రైతులు డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పాత మహారాజ ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజార్ రాజావారిది కాదని, అది 1922 నుండి అంటే బ్రిటీష్ కాలం నుండి ప్రభుత్వ స్థలమే నని, ఇప్పుడు అధికారన్ని అడ్డు పెట్టు కుని అశోక్ గజపతి రాజు ఈ స్థలాన్ని కాజేయ్యాలనే ప్రయత్నం చేయడం సరికాదని పట్టణ పౌర సంక్షేమ సంఘ %శీ% జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. అందుకే ఇక్కడే రైతు బజార్ ను కొనసాగించాలని. డిమాండ్ చేశారు. 1922 నుండి 1995 వరకు ఇక్కడ మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగిందని, 1995లో దాన్ని వేరే చోటుకి తరలించారన్నారు. 1995 నుండి 99 వరకు కాలిగా ఉన్న స్థలం ప్రయివేటు ది అయితే 1999 ఇదే అశోక గజపతి రాజు గారే రైతు బజారు ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. ఇది మహారాజ వారి వారసులు స్థలం అనడానికి ఎటువంటి ఆధారాలు లేవని 2018 లో టీడీపీ ప్రభుత్వమే సీసీఎల్‌ఏ ఆఫీసు నుండి జి ఓ ఇచ్చిందన్నారు. వీటి పూర్తి ఆధా రాలుతో ప్రెస్ లో మాట్లాడారు. కలెక్టర్ రైతుబజారు అనువైన చోటుకి తరలించమని చెప్పడం సరైన ది కాదాన్నారు. 26 ఏళ్లుగా ప్రభుత్వ స్థలం లో నడుస్తున్న రైతు బజారుని ఎత్తేసి రైతులు బతుకులు రోడ్డున పడేయడం అన్యాయమని. ఇక్కడే రైతు బజారు కొనసాగించి. మిగతా స్థలం ప్రభుత్వం ఆఫీస్ లకి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్య పై న్యాయం కోసం సోమవారం చలో కలెక్టెట్ కి వెళ్లి ధర్నా చేస్తున్నాం. అన్నారు. ఈ పోరాటం లో రైతులుకి, వినియోగ దారులు కి అండగా ప్రజలంతా మద్దత్తు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో,రైతు సంఘము జిల్లా కార్యదర్శి బి. రాంబాబు. ఉత్తరంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాస. కేవీపీస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో సిగరెట్స్, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ గారు జూలై 20న హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను, విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వ్యాపారులపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లుకు, మందుబాబులకు కౌన్సిలింగు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్ తో దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న మందుబాబులపై కేసులు నమోదు చేశామని జిల్లా తెలిపారు. అదే విధంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు చేసే కిరాణా, పాన్ షాపు వ్యాపారులపై కూడా దాడులు చేపట్టామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కేసులు నమోదు చేసి, వారిపై జరిమానాలు విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై జూలై 19న ఒక్కరోజునే 255 కేసులు నమోదు చేశారు. అదే విధంగా విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వారిపై 53 కేసులు నమోదు చేసి, జరిమానగా వారిపై రూ.8,500/- విధించాలని తెలిపారు. మద్యం సేవించి, పట్టుబడిన మందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని, విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించవద్దని సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు ఎంపీ కలిశెట్టి హర్షం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ఈనెల 21 నుండి జరగబోయే ఢిల్లీ పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో రాష్ట్ర,జిల్లా ప్రజల తరఫునుంచి పార్లమెంట్‌లో పలురకాల సమస్యలపై చర్చించే అంశాలపై మీడియా ముఖంగా ప్రస్తావించిన ఎంపీ కలిశెట్టి విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడిచిన సందర్భంగా, ఎంపీ ఈఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా, నిర్దేశాలతో విజయనగరం జిల్లా ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమం తెలియపరుస్తూ, పార్లమెంట్ పరిధిలో ప్రతీ నియోజకవర్గంలో ఒక అధునాతనమైన డిజిటల్ లైబ్రరీతో పాటుగా, యోగా కేంద్రాన్ని, విద్యార్థులకు సివిల్స్ ప్రిపేర్ అవడానికి అవసరమైనటువంటి అన్ని రకములైన సదుపాయములతో నిర్మించినట్లు తెలియజేశారు, లైబ్రరీ నిర్మాణంనకు అవసరమైనటువంటి నిధులు ఎంపీ లాడ్స్ మరియు దాతలు సహకారంతో ఇస్తున్నట్లు తెలిపారు. సంభందిత భూసేకరణ అన్నీ నియోజకవర్గాల్లో జరుగుతుందని తెలియజేశారు. అదే విధముగా తన ఏడాది కాలం పార్లమెంటు సమావేశాలలో 100% హాజరుతో, 89 క్వశ్చన్స్‌తో మొదటి వరుసలో ఉన్నానని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం అధ్యక్షతన ఉండవల్లిలో టీడీపీ పార్లమెంట్ సభ్యుల బృందంతో జరిగిన సమావేశంలో పార్లమెంట్ సమావేశాల్లో జరిగిన సంవత్సర కాలంలో ఎంపీలు పనితీరు చాలా బాగుందని ప్రోత్సహిస్తూ... ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినందున పార్లమెంట్లో ప్రజల సమస్యల పై చర్చించాలని, పలు సూచనలు సలహాలు ఇచ్చారని తెలిపారు. రేపటి నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశాలలో విజయనగరం జిల్లా ప్రజల తరఫునుంచి, రాష్ట్ర ప్రజల తరఫు నుంచి పలు రకాల సమస్యలపై, పార్లమెంట్లో చర్చిస్తానని తెలియజేశారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఐవీపీ రాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్స్ కర్రోతు నరసింగరావు, బ్రహ్మ రాజు, నాయకులు సంతోష్ కుమార్, భరత్, కనకల మురళి మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులను సత్కరించిన అతిథి గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ఇటీవల జరిగిన 6వ స్టేట్ సబ్ జూనియర్స్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో స్టేట్ రెండవ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌గా నిలవటం సందర్భంగా క్రీడాకారులను విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అధితి గజపతి రాజు క్రీడాకారులను అశోక్ బంగ్లాలో స్వయంగా సత్కరించారు. ఈ సందర్భంగా పిల్లలకు తగిన పోషకాలను మరియు వారికీ కావలసిన వసతులకోసం వివరాలను అడిగి త్వరలో మరిన్ని మెరుగు అయిన వసతులను కల్పిస్తామని చెప్పారు.

బాబు షూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గడపగడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు గుర్తు చేస్తూ బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వరుసగా మూడవ రోజు ఆదివారం ధర్మపురి, రామ మందిరం నుండి మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి కూటమి ప్రభుత్వంలోసంవత్సర రెండు నెలల కాలంలో అందుకున్నటువంటి పథకాలను అడిగి తెలుసుకున్నారు. 45 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, నిరుద్యోగ యువతకు ఉద్యోగం, సూపర్ సిక్స్ పథకాలు ఇంకా అమలు చేయలేదు అని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసిన మీరే ప్రశ్నించాలని మీకు అండగా వైసీపీ ప్రభుత్వం ఉంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వానికి, ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకి తేడా గమనించవలసిన అవసరం ఎంతైనా ఉందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నగర మున్సిపల్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జిల్లా పార్టీ ఉప అధ్యక్షులు ఎస్ వి వి రాజేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సంఘంరెడ్డి బంగారు నాయుడు, నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బొద్దన అప్పారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గదుల సత్యలత, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా వుంటాం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పార్వతీపురం మన్యం జిల్లాలో పలు గిరిజన సమస్యలను సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు దృష్టికి తీసుకువచ్చారు. విజయనగరంలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కృష్ణమూర్తి చైర్మన్ డాక్టర్ శంకరరావును కలిసారు. ఏజన్సీలోని పలు సమస్యలను తెలిపారు.కురుపాం నియోజక వర్గంతో పాటు ఇతర ఏజన్సీ ప్రాంతాలలో ఇప్పటికీ మౌలిక సదుపాయలు కొరపడిన పరిస్థితులున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్య, వైద్య అందని పరిస్థితులున్నాయన్నారు.మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వైద్యం సహాయం పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని,రహదారి సౌకర్యం లేనందున ఇబ్బందులు పఢుతున్నారని కృష్ణ మూర్తి తెలిపారు.కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు స్పందిస్తూ ఏజన్సీ ప్రాంతాల సమస్యలను తమ క్షేత్ర స్థాయి పర్యటన లలో గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతోందని తెలిపారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని డాక్టర్ శంకరరావు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కృష్ణమూర్తికి తెలిపారు.

తల్లికి వందనం పథకం అర్హులైనవారికి తిప్పలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : ఏపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వ అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికి జమ చేస్తామని తెలిపింది ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు డబ్బులు ఇస్తామని చెప్పింది ఒక్కొక్క విద్యార్థికి రూ 15000 వేలు ప్రకటించగా. ప్రభుత్వ పాఠశాల నిర్వహణ కోసం రూ 2000 వేలు మినహాయించుకొని ఒక్కొక్క విద్యార్థికి రూ 13000 వేలు చప్పున డబ్బుల్ని తల్లిని ఎకౌంట్లో జమ చేసారు. అయితే కొందరు విద్యార్థులకు, భూమి ఎక్కువగా ఉందని. నాలుగు చక్రాల వాహనం ఉందని, కరెంట్ బిల్లులు ఎక్కువగా వచ్చిందని, హౌస్ మ్యాపింగ్‌లో సమస్యలు గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను అర్హులైన లబ్ధిదారులకు పలు సమస్యలతో తల్లికి వందనం పథకానికి అనార్హులయ్యారు. అయితే కొందరు సమస్యలు పరిష్కరించి గ్రీవెన్స్‌లో పెట్టారు. కొంతమందికి తల్లికి వందనం వచ్చాయి మరి కొంతమందికి రాలేదు, ఒకటవ తరగతి ఇంటర్మీడియట్ రెండో జాబితాలో అనర్హులైన వారికి గ్రీవెన్స్ ఇవ్వవలసిందిగా పలువురు కోరుతున్నారు. అయితే ఇప్పటికీ కొంతమంది సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యలో పరిష్కరించి తమ కూడా తల్లికి వందనం పథకం డబ్బులు వచ్చేలా చూడాలని కోరుచున్నారు.

ఉత్సాహంగా ప్రారంభమైన పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ క్రీడా మైదానంలో పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిధిగా హాజరైన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి 13 ఏళ్ళ నుండి 18 ఏళ్ళ లోపు పారా క్రీడాకారులు వంద మందికి పైగా ఈ పోటిల్లో పాల్గొవడం శుభపరిణామమని అన్నారు. ప్రధానంగా రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటిల్లో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఆగష్టు లో హర్యానాలో జరుగనున్న జాతీయ స్థాయి పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2025 కొరకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్, శ్రీకాకుళం అధ్యక్షులు తురెళ్ల రాము, మన్యం జిల్లా అధ్యక్షులు చీమల రాంబాబు, ఇంటర్నేషనల్ మెడలిస్ట్ శివగంగా, పారా నేషనల్ స్విమ్మర్ రవి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ చేపట్టిన వాకర్స్ క్లబ్బులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో "స్వచ్ భారత్" కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా క్లబ్ సభ్యులంతా నడక మైదానంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని అంతా ఏరివేసిన నంతరం వయ్యారిభామ మొక్కలు,పిచ్చిమొక్కలను, తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడుతూ సేవాకార్యక్రమాల్లో భాగంగా స్వచ్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రజలంతా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కాలుష్యనివారణకు నడుంబిగించాలని, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్తామని అన్నారు.